ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |




PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

మంగళవారం 03, మార్చి 2026 | సంపుటి :01 | సంచిక :10 | పేజీలు :4


## కేసముద్రంలో

# నయా నయాం గ్యాంగ్?





### పెట్రేగిపోతున్న రౌడీయిజం..?

- రాజకీయ నేతల అండదండలతో బరితెగింపు
- గూండాయిజాన్ని పెంచిపోషిస్తున్న ఓ ప్రముఖ రాజకీయ పార్టీ?
- సుమారు ఆరునెలలుగా మండల కేంద్రంలో కొత్త సంస్కృతి?
- ఎదిరిస్తే బెదిరింపులు, భౌతిక దాడులు
- నవ యువకులనే లక్ష్యంగా గ్యాంగ్ కార్యకలాపాలు
- కేసుల పాలైతే ఆ యువకుల జీవితాలు గల్లంతే..

2

ఒకప్పుడు రాష్ట్రాన్ని వణికించిన నయీం గ్యాంగ్ ఉదంతాలు ఇంకా ప్రజల మదిలో చెరిగిపోకముందే, అదే తరహా కార్యకలాపాలు మళ్లీ పునరావృతమ వుతున్నాయన్న అనుమానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టాన్ని లెక్కచేయకుండా, భయభ్రాంతులను ఆయుధంగా మార్చుకుని, రాజకీయ అండదండలతో గూండా యిజాన్ని కొనసాగిస్తున్న ఓ నయా గ్యాంగ్ కేసముద్రం ప్రాంతంలో పట్టు బిగిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కేంద్రంగా అభివృద్ధి దిశగా దూసుకెళ్లాల్సిన కేసముద్రం, ఇప్పుడు సెటిల్ మెంట్ రాజకీయం, బెదిరింపులు, దౌర్జన్యాలకు కేంద్రంగా మారుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యువకు లను ప్రలోభపెట్టి గ్యాంగ్ లో చేర్చుకోవడం, ఎదిరించిన వారిపై బెదిరింపులు, భౌతిక దాడులు, అక్రమ వసూళ్లు వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని రాజకీయ శక్తుల మద్దతు ఉందన్న ప్రచారం మరింత చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట పరిరక్షణ యంత్రాంగం కళ్లముందే ఇలాంటి వికృత చర్యలు జరుగుతున్నాయా? లేక ప్రజల్లో వ్యాపిస్తున్న భయమే ఈ అనుమానాలకు కారణమా? అన్నది స్పష్టత కావాల్సిన అంశంగా మారింది. అయితే మండల ప్రజల్లో మాత్రం అసహనం, ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి, శాంతి, భద్రతలతో ముందుకు సాగాల్సిన ప్రాంతం మళ్లీ గ్యాంగ్ సంస్కృతికి వేదికవుతుందా? అన్న సందేహాలు కేసముద్రం భవిష్యత్తుపై మబ్బులు కమ్ముతున్నాయి.

— ప్రభాత గమనం, హైదరాబాద్ స్టేట్ బ్యూరో

## హోలీ శుభాకాంక్షలు

ఆకుపచ్చని అడవి కొత్త చిగుళ్లు తొడిగి.. కోయిలమ్మ కుహూ రాగాలతో ప్రకృతి పులకించే వేళ, చలికి వీడ్కోలు చెబుతూ నునువెచ్చని ఎండల పలకరింపుతో వసంతం విచ్చేసింది. ఈ మధుర సమయంలో మనసుల్లోని ద్వేషాలను తుడిచేసి, మమతానురాగాల రంగులను నింపే అద్భుత వేడుక 'హోలీ'. ప్రకృతిలోని రంగులన్నీ ఇంద్రధనస్సులా నేల మీద పరుచుకున్నట్లుగా.. కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఒక్కటిగా కలిసి జరుపుకునే ఈ రంగుల పండుగ ప్రతి ఇంటా కోటి కాంతులు నింపాలని 'ప్రభాత గమనం' మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తోంది. రంగుల కేళిలో మునిగితేలుతూ, స్నేహానుబంధాలను పటిష్టం చేసుకునే ఈ శుభసమయంలో.. మన రాష్ట్రం, దేశం సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ.. మా ప్రియతమ పాఠకులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రకటనకర్తలకు హృదయపూర్వక హోలీ పండుగ శుభాకాంక్షలు!

- ప్రభాతగమనం టీం



## రికార్డులు బ్రేక్..!

- టీజీఎస్పీడీసీఎల్ అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదు
- ఒకేరోజు 6,057 యూనిట్ల వినియోగం

04

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

# కేసముద్రంలో నయా నయాం గ్యాంగ్?

## పెట్రేగిపోతున్న రౌడీయిజం..?

ఒకప్పుడు రాష్ట్రాన్ని వణికించిన నయాం గ్యాంగ్ ఉదంతాలు ఇంకా ప్రజల మదిలో చెరిగిపోకముందే, అదే తరహా కార్యకలా పాలు మళ్లీ పునరావృతమ వుతున్నాయ న్న అనుమానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టాన్ని లెక్కచేయ కుండా, భయభ్రాంతులను ఆయుధంగా మార్చు కుని, రాజకీయ అండదండలతో గూండా యిజాన్ని కొనసాగిస్తున్న ఓ నయా గ్యాంగ్ కేసముద్రం ప్రాం తంలో పట్టు బిగిస్తోందని స్థానికులు చర్చించుకుం టున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కేంద్రంగా అభివృద్ధి దిశగా దూసుకెళ్లాల్సిన కేసముద్రం, ఇప్పుడు సెటిల్ మెంట్ రాజకీయం, బెదిరింపులు, దౌర్జన్యాల కు కేంద్రంగా మారుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యువకు లను ప్రలోభపెట్టి గ్యాంగ్ లో చేర్చుకోవడం, ఎదిరించిన వారిపై బెదిరింపులు, భౌతిక దాడులు, అక్రమ వసూళ్లు వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని రాజకీయ శక్తుల మద్దతు ఉందన్న ప్రచారం మరింత చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట పరిరక్షణ యంత్రాంగం కళ్లముందే ఇలాంటి వికృత చర్యలు జరుగుతున్నాయా? లేక ప్రజల్లో వ్యాపిస్తున్న భయమే ఈ అనుమానాలకు కారణమా? అన్నది స్పష్టత కావాల్సిన అంశంగా మారింది. అయితే మండల ప్రజల్లో మాత్రం అసహనం, ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి, శాంతి, భద్రతలతో ముందుకు సాగాల్సిన ప్రాంతం మళ్లీ గ్యాంగ్ సంస్కృతికి వేదికవుతుందా? అన్న సందేహాలు కేసముద్రం భవిష్యత్తుపై మబ్బులు కమ్ముతున్నాయి.

- రాజకీయ నేతల అండదండలతో బరితెగింపు
- గూండాయిజాన్ని పెంచిపోషిస్తున్న ఓ ప్రముఖ రాజకీయ పార్టీ?
- సుమారు ఆరునెలలుగా మండల కేంద్రంలో కొత్త సంస్కృతి?
- ఎదిరిస్తే బెదిరింపులు, భౌతిక దాడులు
- నవ యువకులనే లక్ష్యంగా గ్యాంగ్ కార్యకలాపాలు
- కేసుల పాలైతే ఆ యువకుల జీవితాలు గల్లంతే..

**హైదరాబాద్ స్టేట్ బ్యూరో, ప్రభాత గమనం :**

నయాం గ్యాంగ్ రాష్ట్రాన్ని కుదిపేసిన విషయం విధితమే. రాష్ట్రంలో ఎంతోమంది రాజకీయ నేతలు నయాం గ్యాంగ్‌కి బెదిరిపోయారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా తన నెట్‌వర్క్‌ని విస్తరింపజేసుకొని కొన్ని రోజుల పాటు తన ప్రభావాన్ని సమాజంపై చూపించాడు. ప్రముఖ రాజకీయ నేతలు సైతం తన బెదిరింపులకు వణికిపోయారంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి గ్యాంగ్‌ని గత ప్రభుత్వాలు నిలువరించేశాయి. ఇప్పుడు ఆ నయాం లాంటి గ్యాంగ్‌లనే ఆదర్శంగా తీసుకొని ఇప్పుడు మానుకోట జిల్లా కేసముద్రంలో ఓ నయా నయాం గ్యాంగ్ అవతరించిందని ప్రజలు అనుకుంటున్నారు..

### మండలానికి జాతీయ స్థాయిలో గుర్తింపు..

కేసముద్రం కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కేంద్రం. అయితే కేసముద్రం మండల కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. అలాంటిది.. మండల కేంద్రానికే మచ్చగా మారుతోందట ఆ గ్యాంగ్ కార్యకలాపాలు. నవ యువకులను గ్యాంగ్‌లో చేర్పించుకుంటూ.. గూండాయిజాన్ని కొనసాగిస్తున్నారని మండల ప్రజలు చర్చించుకు[illegible] ఓ ప్రముఖ రాజకీయ పార్టీ అండదండలతో ఈ రౌడియిజాన్ని మూడుపువ్వులు ఆరు కాయలు అన్నచందంగా అమలు చేస్తున్నారని సమాచారం. దురదృష్టం కొద్ది ఎవరైనా ఎదిరిస్తే.. వారి పని ఖతమే. బెదిరింపులు, భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారని మండల వ్యాప్తంగా చర్చ నడుస్తుంది. ఇంతటి నవయుగంలో వ్యవస్థలో.. ఆ శాఖ కల్లుగప్పి ఈ చిచొర గ్యాంగ్ చేస్తున్న వికృత కార్యకలాపాలతో మండల ప్రజలు బెంబేలెత్తే పరిస్థితులు వచ్చాయనడంలో ఎలాంటి సంశయంలేదు.

### - నవ యువకులే టార్గెట్

ఉక్కు నరాలు ఇనుప కండరాలు కలిగిన ఒక వంద మంది యువత నాకు కావాలని నాడు యువతకు స్ఫూర్తి దాయకమైన స్వామి వివేకానంద పిలుపునిచ్చారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాల్సిన ఈ పరిస్థితుల్లో.. 20 నుంచి 30 ఏళ్ల లోపు యువకులు, ఇప్పుడిప్పుడే డిగ్రీలు పూర్తి చేసిన నవ యువకులు.. రౌడీయిజం వైపు మల్లుతున్నారని ఆరోపణలు వస్తున్నాయని. ఒకపూట బీర్లు, బిర్యానీల కోసం వారి మంచి భవిష్యత్తును వారికి తెలియకుండానే అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఈ నవ యువతను ఆసరగా చేసుకొని వారికి తాయిలాల రూపేనా ఆశచూపి, పాకెట్ మనీ ఇచ్చి, బీరు, బిర్యానీలు అందించి.. గూండాయిజాన్ని కొనసాగిస్తున్నారు.

### - ఇలానే కొనసాగితే మండలానికే చెరిపేయలేని మచ్చ...

సుమారు ఆరు నెలలుగా కొనసాగుతున్న గ్యాంగ్ దుశ్చర్యలు.. ఇలానే ఉంటే కేసముద్రంకు చెరిపేయలేని మచ్చగా మిగిలిపోతుంది. హద్దుఅదుపు లేకుండా పెట్రేగిపోతున్న ఈ రౌడీగ్యాంగ్‌పై వెంటనే ఇంటెలిజెన్స్ వర్గాలు వీరిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. వత్తాసు పలుకుతున్న ఆ రాజకీయ పార్టీ నేతలపై ఓ కన్నేసి ఉండాలి. అవసరమైతే శాఖాపరమైన చర్యలకు సైతం వెనుకాడకూడదు. రౌడీయిజం వైపు మల్లుతున్న యువతకు కౌన్సిలింగ్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉంది. కొత్తగా రౌడీయిజం వైపు మల్లకుండా ఉండేందుకు.. స్థానికంగా అవగాహన కార్యకలాపాలు చేపట్టాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. లేదంటే వీరి బెదిరింపులకు, వీరి గూండాయిజానికి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఇవాళ బెదిరింపులు, దాడులతో కొనసాగుతున్న ఈ గ్యాంగ్ కార్యకలాపాలు.. రేపటి రోజున హత్యల వరకు కూడా దారి తీసే పరిస్థితి ఉంది. కావున తక్షణమే పోలీసు శాఖ ఈ గ్యాంగ్‌పై దృష్టిసారించి మండల కేంద్రానికి ఉపశమనం కల్పించాలని స్థానిక ప్రజానీకం కోరుతోంది....






## పోస్ట్ మార్టం గదిని వెంటనే ప్రారంభించాలి

గార్ల మార్చి 2(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా గార్ల ప్రభుత్వ దవాఖానలో పోస్ట్ మార్టం గదిని వెంటనే ప్రారంభించాలని బాధిత కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నాడు వారు అధికారులకు పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గార్ల మండలంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో పోస్ట్ మార్టం గది లేకపోవడంతో మృతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసహజ మరణాలు, మెడికో లీగల్ కేసుల సందర్భాలలో మృతదేహాలను దూర ప్రాంత హాస్పిటల్ కు తరలించాల్సి వస్తుందని తెలిపారు. బాధిత కుటుంబాలకు మానసిక వేదనతో పాటు న్యాయ ప్రక్రియల్లో ఆలస్యం జరుగుతూ పేద ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గార్ల మండలంలో వెంటనే పోస్ట్ మార్టం గదిని నిర్మాణం చేపట్టాలని, అందులో కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులను కోరారు.

## రోడ్డుపై గుంత... ఆదమరిస్తే అంతే..

కేసముద్రం మార్చి 2(ప్రభాత గమనం): కేసముద్రం–మహబూబాబాద్ మార్గ మధ్యలో తాళ్లపూసపల్లి గ్రామంలోని బొడ్రాయి వద్ద పెద్ద గుంత ఏర్పడింది. క్వారీ లారీలు మోతాదుకు మించి అధిక లోడ్ తో ప్రయాణం చేయడం మూలంగా పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి వేళ వందలాది లారీలు ప్రయాణం చేయటం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న నరేటి సత్తయ్య కుటుంబం రాత్రివేళలో బిక్కుబిక్కుమంటూ



ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నిద్రించాల్సిన దుస్థితి. ఇప్పటికైనా ఆర్అండ్ బీ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ గరీబోళ్ల పార్టీ

- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయండి
- ప్రజలకు, పార్టీ మధ్య వారధిలా ఉండాలి
- పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం



ప్రభాత గమనం, వికారాబాద్ : కాంగ్రెస్ కేడర్ తో క్షేత్రస్థాయిలో మమేకమై ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని, అప్పుడే కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో తిరుగులేని బలం చేకూరుతుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో కలిసి ఆయన శంషాబాద్ లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా వికారాబాద్ కు బయలుదేరిన రాహుల్ గాంధీకి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సాదరంగా ఆహ్వానం పలికారు. ముందుగా రాహుల్ పీఏసీ సమావేశం నిర్వహించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. అక్కడ పది రోజుల పాటు సాగిన నూతన డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా స్థాయి నాయకత్వం అనేది పార్టీకి అత్యంత కీలకమైనదని, ప్రజలకు పార్టీకి మధ్య వారధిలా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వారి ఇబ్బందులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై రాష్ట్ర నాయకత్వంతో రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. ఈ నెల 16న జరగనున్న ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగుతోందని, అభిషేక్ మను సింఘ్వీని మరోసారి నామినేట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మిగిలిన ఒక స్థానం కోసం రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ నేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. శాసనసభలో కాంగ్రెస్ కు ఉన్న బలం దృష్ట్యా రెండు రాజ్యసభ స్థానాలను సునాయాసంగా గెలుచుకుంటామనే ధీమాను రాహుల్ గాంధీ వ్యక్తం చేసినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికపై అధికారిక ప్రకటన ఈ నెల 4వ తేదీన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లా అధ్యక్షులు తమ పరిధి లోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి పార్టీ కమిటీలను పటిష్టం చేయాలని, భవిష్యత్ ఎన్నికలే లక్ష్యంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ముఖ్య నేతలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రెండు రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### - మంత్రులకు అనుమతి నో

రాహుల్ గాంధీ సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రులకు పీసీసీ, అధిష్ఠానం అనుమతి ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం కావడంతో, దీనికి మంత్రుల రాకపై పీసీసీ ఆంక్షలు విధించడం చర్చనీయాంశంగా మారింది. పీసీసీ నుంచి సూచనలు వచ్చే లోపే కొందరు మంత్రులు అనంతగిరి చేరుకుంటుండగా, సమావేశానికి రావొద్దనే ఆదేశాలు వచ్చాయని తెలిసింది. ఇదే విషయాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా ఖరాఖండీగా స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో మంత్రులు చేసేదేమీ లేక తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. రాహుల్ గాంధీ సమక్షంలో తమ ఉనికిని చాటుకోవాలనుకున్న మంత్రులకు, కేవలం పార్టీ కేడర్‌కే ప్రాధాన్యత ఇవ్వాలనే పీసీసీ నిర్ణయం షాక్ ఇచ్చింది.

# నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా జంపాల విక్రం, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ప్రవీణ్ నియామకం



జంపాల విక్రం
అధ్యక్షుడు



కొత్తపల్లి ప్రవీణ్
ప్రధాన కార్యదర్శి

కేసముద్రం మార్చి 2(ప్రభాత గమనం): కేసముద్రం మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా జంపాల విక్రం, కొత్తపల్లి ప్రవీణ్ లు ఎన్నికయ్యారు. సోమవారం నాడు నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడు లింగాల నేతాజీ,వర్కింగ్ ప్రెసిడెంట్ మడిపెల్లి కృష్ణమూర్తి ఆద్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులుగా జంపాల విక్రం, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ప్రవీణ్,గౌరవ అధ్యక్షులుగా జంపాల రమేష్,ఉపాధ్యక్షులుగా లింగాల నరసయ్య, కోశాధికారిగా లింగాల వెంకటేష్, సహయ కార్యదర్శిగా నాగవల్లి రఘు లు ఏకగ్రీవంగా గా ఎన్నికయ్యారు. అనంతరం మండల అధ్యక్షులు లింగాల నేతాజీ మాట్లాడుతూ..సంఘ సమస్యలపై, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలై కొట్లాడలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. ప్రభుత్వం వారిని ఆదుకొని నూతన కమిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. దాని ఏర్పాటు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జంపాల అంజయ్య, రామ్మూర్తి, రాము, రాంప్రసాద్, సింగరపు ఉపేందర్, వల్లాజీ రాజు, నగేష్,లింగాల సుదర్శన్,సుధాకర్, రమేష్, రాజు, సురేష్,వెంకటేష్, నాగవల్లి రాజు, ఆదర్శ శివశంకర్, ఎలగందుల రాజు, గొల్లపెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాళం

- అద్దె చెల్లించడం లేదని ఇంటి యజమాని నిర్వాకం
- ఆరేళ్లుగా రూ. 23.55 లక్షల బకాయి

మరిపెడ (ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి యజమానులు సోమవారం సాయంత్రం తాళం వేశారు. గత ఆరు సంవత్సరాలుగా భవనానికి సంబంధించిన అద్దె చెల్లించకపోవడంతో విసిగిపోయిన యజమానులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. కళాశాల నిర్వహిస్తున్న భవనానికి గత ఆరేళ్లుగా ప్రభుత్వం నుంచి అద్దె అందడం లేదు. మొత్తం రూ. 23.55 లక్షల మేర బకాయిలు పేరుకుపోయాయని భవన యజమానులు కాలం రవీందర్ రెడ్డి, కాలం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల చేయాలని ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా, ఎన్ని వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతోనే తాళం వేయాల్సి వచ్చిందని వా రు స్పష్టం చేశారు. భవనానికి తాళం వేయ డం తో కళాశాల నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. దీనిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేసి, కళాశాల సజావుగా సాగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## సంప్రదాయ పద్ధతుల్లో

# హోలీ జరుపుకుందాం

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

ప్రభాతగమనం, వరంగల్: సంప్రదాయ పద్ధతుల్లో హోలీ పండుగను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. హోలీ పండుగను పురస్కరించుకుని ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. పండగ రోజు ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హోలీ అనంతరం యువత స్నానాల కోసం చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళవద్దని, తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ప్రధానంగా బహిరంగ ప్రదేశాలపై, అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు,వాహనాలపై రంగులు చల్లడం బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.



# ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

### - నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్

మహబూబాబాద్ మార్చి 2(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా సమీకృత భవనంలో జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ సభాపతి దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా సోమవారం వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శ్రీపాదరావు శాసనసభ్యుడిగా, సభాపతిగా ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సభను నిష్పక్షపాతంగా, గౌరవప్రదంగా నడిపి అధికార–విపక్షాలకు సమాన న్యాయం చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచారని తెలిపారు. శాసనసభ గౌరవం, నియమావళి పటిష్టతకు ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా ప్రస్తావిస్తూ, సరళ జీవనం విలువల రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడిగా ఆయనను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె అనిల్ కుమార్, ఆర్డీఓ, డీవైఎస్ఓ ఓలేటి జ్యోతి, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ‘శ్రీ వివేకవర్ధిని’లో ముందస్తు హోలీ వేడుకలు

కేసముద్రం మార్చి 2(ప్రభాత గమనం): కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధని హైస్కూల్లో హోలీ పండుగ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం రంగులు పూసుకుంటూ హర్షోత్సాహాలతో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం రంగుల సందడితో కళకళలాడింది.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చిర్రా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ..హోలీ పండుగ ప్రత్యేకతను వివరించారు. ప్రేమ, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అయిన హోలీని సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే రసాయనిక రంగులను వాడటం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలగవచ్చని పేర్కొంటూ, ప్రకృతి సిద్ధమైన రంగులను ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

## గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ వాసులు
# భయపడొద్దు

**: మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



హైదరాబాద్ (ప్రభాత గమనం):
ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, అక్కడ నివసిస్తున్న తెలంగాణ వాసులు మరియు వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైందని, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ వారి భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా జగిత్యాల జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వేలాది మంది క్షేమ సమాచారంపై ప్రభుత్వం నిరంతర నిఘా ఉంచిందని మంత్రి తెలిపారు. బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను (ఫోన్: 011-23380556) ఏర్పాటు చేశారు.

### అత్యవసర సహాయం కోసం అధికారులు:

గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి సమాచారం కోసం ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చని ప్రభుత్వం సూచించింది. వందర బరువా (లైజన్ హెడ్): 9871999044, జి. రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్): 9643723157, సీహెచ్ చక్రవర్తి (పీఆర్వో): 9949351270 అందుబాటులో ఉంచింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మరియు రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరుపుతూ, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వివరించారు.

## హైదరాబాద్ లో నేడు వైన్స్, బార్లు బంద్

**: సీపీ సజ్జనార్ ఆదేశం**

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

హోలీ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగర వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేయాలని సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశించారు. మార్చి 3 (మంగళవారం) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైన్స్, కల్లు కాంపౌండ్లు, బార్లు మరియు క్లబ్‌లు మూసి ఉంచాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గొడవలకు దిగడం వంటివి చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని సీపీ తెలిపారు. దారిపోయే వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లడం, డీజేలు ఏర్పాటు చేయడం మరియు వాహనాలపై గుంపులుగా తిరగడంపై నిషేధం విధించారు. మహిళల రక్షణ కోసం 'షీ టీమ్స్' ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే 'డయల్ 100'కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### నేడే హోలీ సెలవు:

మరోవైపు, హోలీ పండుగ తేదీపై ఉన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. తొలుత మార్చి 4న సెలవుగా ప్రకటించినప్పటికీ, పండితుల సూచన మేరకు మార్చి 3వ తేదీనే (నేడు) పండుగ జరుపుకోవాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా విద్యాశాఖ నేడే సెలవు ప్రకటిస్తూ తాజా సర్క్యులర్ జారీ చేసింది.



## బాల్క సుమన్ కు బెయిల్ మంజూరు

- **14 రోజుల తర్వాత జైలు నుంచి విడుదల**

**ప్రభాత గమనం, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణల కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత 14 రోజులుగా ఆదిలాబాద్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు మంచిర్యాల జిల్లా కోర్టు సోమవారం ఈ ఊరటనిచ్చింది. బాల్క సుమన్‌తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురికి కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది.

### ఘటన నేపథ్యం:

ఫిబ్రవరి 18న క్యాతన్‌పల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల సమయంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీల కాన్వాయ్‌పై బీఆర్ఎస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో మంత్రి, ఎంపీల కార్ల అద్దాలు ధ్వంసం అవ్వగా, కాంగ్రెస్ – బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల ఫిర్యాదు మేరకు బాల్క సుమన్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### కోర్టు విధించిన షరతులు:

బెయిల్ మంజూరు చేసిన సందర్భంలో కోర్టు కొన్ని కీలక షరతులను విధించింది. బెయిల్‌పై విడుదలైన తర్వాత నిందితులు ప్రతి ఆదివారం రామకృష్ణపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విధిగా హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ ముగియడంతో బాల్క సుమన్ జైలు నుండి విడుదల కానున్నారు.

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

**: సీఎం రేవంత్ రెడ్డి**



ప్రభాత గమనం, వికారాబాద్:
దేశ భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో జరిగిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టడమే కాంగ్రెస్ కార్యకర్తల తదుపరి లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### సామాన్య కార్యకర్త నుంచి సీఎం స్థాయికి:

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. కేవలం 19 ఏళ్ల కాలంలో ఒక సామాన్య జడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు ఎదిగానని తెలిపారు. తన ఎదుగుదలలో ఎన్నడూ పైరవీలకు తావులేదని, కేవలం ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే తనను ఈ స్థాయికి చేర్చిందని వివరించారు. ప్రజల పక్షాన నిలబడినందుకు తనపై ఎన్నో కేసులు, పరువు నష్టం దావాలు వేసినా వెనకడుగు వేయలేదని ధీమా వ్యక్తం చేశారు.

### సోనియా గాంధీపై ప్రజల నమ్మకమే బలం:

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సోనియా గాంధీపై ప్రజలకు ఉన్న నమ్మకమే ప్రధాన కారణమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో కేంద్రంలోనూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. "ప్రజల సమస్యలపై పోరాడటమే మన మార్గం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మన గమ్యం" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## గత రికార్డులు బ్రేక్..

- **టీజీఎన్పీడీసీఎల్ అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు**
- **ఒకేరోజు 6,057 యూనిట్ల వినియోగం**



వరంగల్ (ప్రభాత గమనం): తెలంగాణలో భానుడు ఇప్పుడే తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గత రికార్డులన్నింటినీ బ్రేక్ చేస్తూ దూసుకుపోతోంది. టీజీఎన్పీడీసీఎల్ (TGNPDCL) చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి చివరి వారంలో అత్యధికంగా 6,267 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైనట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు.

### వరుసగా రికార్డుల బ్రేక్:

ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండలు ముదురుతుండటంతో గృహ, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. శనివారం నమోదైన 6,057 మెగావాట్ల రికార్డును అధిగమిస్తూ, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే డిమాండ్ 6,267 మెగావాట్లకు చేరడం ఒక మైలురాయిగా నిలిచిందని సీఎండీ పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆశ్రయించడమే ఈ రికార్డు స్థాయి డిమాండ్‌కు ప్రధాన కారణమని వివరించారు.

### నిరంతర సరఫరాకు ఆటంకం లేదు:

డిమాండ్ ఎంత పెరిగినా వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ సర్వసన్నద్ధంగా ఉందని సీఎండీ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల పర్యవేక్షణలో నిరంతర సరఫరాయే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రానున్న మార్చి నుంచి మే వరకు వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ (IMD) హెచ్చరించిన నేపథ్యంలో, మున్ముందు పెరిగే డిమాండ్‌ను తట్టుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

## హైదరాబాద్ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

**ఏసీ బస్సుల టికెట్ ధరలు తగ్గింపు**

**హైదరాబాద్ (ప్రభాత గమనం):**

నగరంలోని ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) తీపి కబురు అందించింది. ప్రయాణికుల రద్దీని పెంచే లక్ష్యంతో ఎలక్ట్రిక్ ఏసీ మరియు మెట్రో డీలక్స్ బస్సుల టికెట్ ధరలపై రూ. 5 నుంచి రూ. 10 వరకు రాయితీని ప్రకటించింది. ఈ నూతన ధరలు మార్చి 1వ తేదీ నుంచే అమలులోకి వచ్చాయి.
ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి పథకం) అమలవుతుండటంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు రద్దీగా ఉంటున్నాయి. దీనికి విరుద్ధంగా ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 60 నుంచి 70 శాతానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో, ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులను ఏసీ బస్సుల వైపు ఆకర్షించేందుకు ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.

### తగ్గిన ధరల వివరాలు:

- **తక్కువ దూరం: 10 కిలోమీటర్ల (5 స్టేజీలు) ప్రయాణానికి ప్రస్తుతం ఉన్న రూ. 50 టికెట్ ధరను రూ. 40కి తగ్గించారు.**
- **ఎక్కువ దూరం: 20 కిలోమీటర్ల (10 స్టేజీలు) ప్రయాణానికి రూ. 55 ఉన్న ధరపై రూ. 10 రాయితీ కల్పించి రూ. 45గా నిర్ణయించారు.**

హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్ వంటి ప్రధాన మార్గాల్లో నడిచే ఏసీ బస్సులకు ఈ రాయితీ వర్తిస్తుంది. తక్కువ ధరకే ఏసీ ప్రయాణం అందుబాటులోకి రావడంతో సామాన్య ప్రయాణికులకు, ముఖ్యంగా పురుషులకు ఇది పెద్ద ఊరటనివ్వనుంది.